ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

కోనసీమ జిల్లా వార్తలు

సోమవారం 16 సెప్టెంబరు 2024 | 5









స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తజనం

సిద్ధి వినాయక ఆలయంలో

భక్తజన సందడి

అయినవిల్లి, సెప్టెంబరు 15: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం భక్తులతో కిటకిటలాడింది. గణపతి నవరాత్రుల్లో తొమ్మిదో రోజు ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అయినవిల్లిలోని రహదారులన్నీ భక్తుల రద్దీతో కిక్కిరిశాయి. మూషిక వాహనంపై స్వామివారికి మాడవీధి సేవ నిర్వహించి పంచ హారతులు, ప్రత్యేక అలంకరణ చేశారు. అయినవిల్లికి చెందిన విళ్ల సూర్యనారాయణ పులిహోర ప్రసాదం అందించారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఉండ్రాళ్ల ప్రసాద వితరణ, నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఏలూరు రేంజ్ ఐజీ గోరంట్ల వెంకటగిరి అశోక్‌కుమార్ దంపతులు విఘ్నేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు.



సన్మానసభలో మాట్లాడుతున్న సీతారామ ఘనాపాఠి

భారతీయ సనాతన ధర్మమే

వేద ధర్మం

పురాణ, ఇతిహాసాల సూక్ష్మరూపమే వేదాలు

కోనసీమ వేదశాస్త్ర సన్మాన సభలో వక్తలు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 15: భారతీయ సనాతన ధర్మమే వేదధర్మమని కడియాల వేంకటసత్యసీతారామ ఘనాపాఠి పేర్కొన్నారు. పురాణేతిహాసాల సూక్ష్మరూపమే వేదాలని వివరించారు. సృష్టికి మూలమైన వేదాలు లోకకల్యాణం కోసమేనని చెప్పారు. అమలాపురం సత్యసాయి కల్యాణ మండపంలో ఆదివారం కోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ 62వ వార్షికోత్సవ కార్యక్రమానికి సీతారామ ఘనాపాఠి అధ్యక్షత వహించి ప్రసంగించారు. వ్యాసమహర్షి వేదాల పరామర్థం అందరికీ అర్థమయ్యేందుకే అష్టాదశ పురాణాలను ప్రపంచానికి అందించారని తెలిపారు. మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి మాట్లాడుతూ దైవం, ధర్మం, పుణ్య పాపాలు వంటి విషయాలు వేదం ద్వారా మాత్రమే తెలుస్తాయన్నారు. స్వర ప్రధానమైన వేదాలు సృష్టి ప్రారంభం నుంచి నేటి వరకు ఒకే స్వరంతో ప్రాంత బేధం లేకుండా ఒకేవిధంగా పఠిస్తూ రక్షింపబడుతున్నాయన్నారు. సకల ప్రాణులు సుఖశాంతులతో ఉండే మార్గాన్ని వేదాలు బోధిస్తున్నాయని తిరుపతికి చెందిన ప్రవా రామకృష్ణ సోమయాజులు అన్నారు. అనంతరం రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన ఘనాపాఠిలు, క్రమపాఠిలు, వేదపండితులు ఆధ్వర్యంలో వేదస్వస్తి నిర్వహించారు. తిరుపతి వేద విశ్వవిద్యాలయం ప్రతినిధి ప్రవా రామకృష్ణ సోమయాజి, దువ్వూరి ఫణియజ్ఞేశ్వర ఘనాపాఠి, గుళ్లపల్లి చిన ఆంజనేయ ఘనాపాఠి, కుమారశర్మ ఘనాపాఠి, వడ్లమాని సుబ్రహ్మణ్య ఘనాపాఠి, ఉపాధ్యాయుల కాశీపతి సోమయాజులు వేదికను అలంకరించి వేదాంతర్గత విషయాలను వివరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 200 మంది వేదస్వస్తి పలికారు. కోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ తరుపున అధ్యక్షుడు గుళ్లపల్లి ప్రభాకర ఫణిరాజా, యేడిద సుబ్రహ్మణ్యం, కుమార శాస్త్రి, భాస్కర్‌లు వేద పండితులనుఘనంగా సత్కరించారు.



బాత్‌రూమ్‌ల దుస్థితి



పగిలిన టైల్స్

హాస్టల్ విజిట్



దెబ్బతిన్న స్లాబ్



వసతి గృహం

హాస్టల్‌లో కష్టాలు..

విద్యార్థులు ఉండే హాస్టల్స్ భవనాలు ఆధునికీకరణకు నోచుకోకపోవడంతో భయం గుప్పెట్లోనే ఉండాల్సిన పరిస్థితి.. దీంతో సంక్షోభంలోనే సాంఘిక సంక్షేమ హాస్టల్స్ కొట్టుమిట్టాడుతున్నాయి. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో హాస్టల్స్ ఆధునికీకరణపై పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడంతో శిథిలస్థితికి చేరే పరిస్థితి ఏర్పడింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో జడ్పీ పాఠశాల సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టల్ ఆధునికీకరణకు నోచుకోకోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం వస్తే స్లాబు నుంచి వర్షపు నీరు లీకై విద్యార్థులు ఉండే గదులలోకి కిచెన్‌లోకి నీరు కారుతుండటంతో విద్యార్థులు, వంట వండే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ హాస్టల్-1, 2 గా రెండు హాస్టల్స్ ఉన్నాయి. బాలికలు వినియోగించుకునే మరుగుదొడ్లు, డోర్లు ఊడిపోయి ఫ్లోర్ టైల్స్ లేచిపోయి అధ్వానంగా మారడంతో బాలికలు టాయిలెట్స్ వినియోగించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక పక్క స్లాబ్ లీకేజీతో చినుకులు గదులలో పడటం, వర్షం కారణంగా కింద గచ్చు కూడా చెమ్మగా మారుతోంది. కింద పరుపులు వేసుకుని బాలికలు నిద్రిస్తున్నప్పటికి చెమ్మ కారణంగా చలి చంపేస్తోందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. ఈ హాస్టల్‌ను బాగు చేయాలని పలువురు కోరుతున్నా పట్టించుకునేవారు కరవయ్యారు..

● రావులపాలెం



చేనేతలను ఎన్నుకునేందుకు..

ఆరున్నరేళ్ల అనంతరం చేనేత సహకార సంఘాల ఎన్నికలు

వార్త 7



అంతర్వేదిలో ముగిసిన పవిత్రోత్సవాలు

7

కష్ట జీవుల కన్నీటి గాథ ఇది..గూడు లేని పేద బతుకుల గోడు ఇది..తలదాచుకునే చోటు కోసం అల్లాడుతున్న ఓ కుటుంబం బతుకు చిత్రమిది..35 ఏళ్ల కిందట కాకినాడ జిల్లా గొల్లప్రోలు ప్రాంతం నుంచి వచ్చి ఇక్కడ డ్రైనేజీ కోసం తెచ్చిన తూరనే ఇల్లుగా చేసుకుని కాలం వెళ్లదీస్తున్న విషాద నేపథ్యం మడిమి దుర్గారావు కుటుంబానిది. అతను అతని భార్య దుర్గమ్మ, వారి కుమారుడు రామచంద్రపురం పెద్దవంతెన వద్ద వెల్ల రోడ్డు మలుపులో ఓ సిమెంట్ తూరలోనే జీవనం సాగిస్తున్నారు. పదేళ్లుగా ఇక్కడే ఉంటున్నా..పదేళ్లుగా అదే దారిలో ఎంతో మంది నేతలు వెళుతున్నా ఒక్కరికి కూడా ఈ కుటుంబాన్ని ఆదుకోవాలనే ఆలోచన రాకపోవడం దారుణం.

గూడు లేని

బతుకు





నివసించేది ఈ తూరలోనే..

పదేళ్లుగా సిమెంట్ తూరలో జీవిస్తున్న పేద కుటుంబం

ఎలుకలు, దోమల మధ్య ఇరుకు ప్రదేశంలో జీవనం

ఆధార్, రేషన్ కార్డులున్నా ప్రభుత్వ గృహం రాలేని వైనం

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 15: దుర్గారావు భార్య బధిర మహిళ.. దుర్గారావు కూలి పనికి వెళుతుండగా.. దుర్గమ్మ ఇండ్లలో పనిచేస్తుంది. వీరి జీవితం పదేళ్లుగా ఆ తూరకే అంకితం అయిపోయింది. ఎలుకలు వస్తున్నా..దోమలు కుడుతున్నా అక్కడే బతకాల్సిన పరిస్థితి వారిది.. ఆధార్ కార్డు ఉన్నా, రేషన్ కార్డు ఉన్నా వారికి పక్కా ఇల్లు మంజూరు కాలేదు. ప్రతి పేదవాడికి గూడు కల్పించే బాధ్యత తీసుకుంటామని ప్రభుత్వాలు చాలా ఏళ్లుగా చెబుతున్న మాటలకు క్షేత్రస్థాయిలోని వాస్తవాలు పూర్తి విరుద్ధంగా ఉంటాయనేదానికి దుర్గారావు కుటుంబమే ఉదాహరణ..



దర్గాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

కొత్తలంకలో

ఉరుసు ఉత్సవాలు

తొలిరోజు సంబరాల్లో పలు కార్యక్రమాలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 15: ముమ్మిడివరం మండలం కొత్తలంకలోని వలీబాబా దర్గా వద్ద ఆదివారం ఉరుసు మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బాబాకు గంధం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో ఉన్న బాబా జెండా స్తంభం నుంచి తెప్పలను నెత్తిన పెట్టుకుని వాటిలో చపాతీ, నిమ్మకాయలు, ఖర్జూర, బొబ్బట్లు, దీపం వంటి పదార్థాలు ఉంచి గుర్రంతో నాట్యం చేయిస్తూ బ్యాండు మేళాలతో ఊరేగింపుగా సత్యనారాయణస్వామివారి ఆలయం వద్దకు చేరుకుని తెప్పలను చెరువులో వదిలి పూజలు నిర్వహించారు. రాత్రి గుర్రంపై బాబాను ఊరేగించి గంధం తీసుకునివచ్చి దర్గాకు వెళ్లి అక్కడ బాబాకు సమర్పించారు. రాష్ట్రం నలుమూలల నుంచి హిందూ, ముస్లిం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి బాబా దర్గాను దర్శించుకుని వారి మతాచారాల ప్రకారం పూజలు జరిపించారు. ముజావర్ అలీబాబా, కమిటీ సభ్యులు గేదెల రఘునాథ్‌బాబా, నూకల శివ, గేదెల ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో బాబా దర్గాను దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దర్గాను దర్శించుకుని పూజలు జరిపించారు. దర్గాకు విచ్చేసిన ఎమ్మెల్యే దర్గా కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో దూడల స్వామినాయుడు, గీసాల చంద్రరావు, తోలేటి రాంబాబు, వీపూరి నాగరాజువర్మ, రవివర్మ, గేదెల స్వరూప్, తోలేటి గోపి, పిల్లా చిన్నా, విత్తనాల భైరవస్వామి, బద్రి రమ, సామంతకుర్తి సుబ్బారావు, వంగా విజయ్, బొక్కా త్రినాథ్, కుచ్చర్లపాటి చిట్టిరాజు, పలివెల నాగరాజులతో పాటు పలువురు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రభుత్వ కృషి

మంత్రి వాసంశెట్టి సుభాష్

అంబాజీపేట, సెప్టెంబరు 15: గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గంగలకుర్రులో జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. గుంటమామిడితోటలో గణపతిని మంత్రి సుభాష్ దర్శించుకున్నారు. అనంతరం మంత్రికి ధాన్యపు కుచ్చును అందించారు. గున్నేపల్లి, సాకుర్రు, ఇందుపల్లి ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, స్థానిక నేతలు మంత్రి సుభాష్‌ను కోరారు. గంగలకుర్రు సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు, దొమ్మేటి నాగన్న, రాయుడు కృష్ణమహేష్ తదితరులు పాల్గొన్నారు.



అడవిని వదిలి.. జనారణ్యంలోకి..

ఇదే పాపికొండలు అభయారణ్యం

చిరుత ఎందుకొచ్చింది.. ఎలా వచ్చింది..

అమ్మో పులి.. రాజమహేంద్రవరంలో ఉందట.. ఎవరి నోటా విన్నా ఇదే మాట.. ఎక్కడ నుంచి వచ్చిందో.. ఎలా వచ్చిందో... ఎందుకు వచ్చిందో అంటూ రకరకాల ప్రశ్నలు.. ఒక్కప్రశ్నకూ అంతుచిక్కదు.. మరో వైపు అటు వైపు వెళితే ఏం జరుగుతుందోననే భయం.. గత 10 రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదీ పరిస్థితి. అసలు పులి ఎక్కడ నుంచి.. ఎలా వచ్చి ఉంటుంది... ఇక్కడికే ఎందుకు వచ్చింది.. అసలేం చేస్తుందనే దానిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అడవి నుంచి దారి తప్పి జనారణ్యంలోకి చిరుత పులి ఎలా రాగలిగింది? చిరుత పులులకు ఆవాసంగా ఉన్న పాపికొండలు అభయారణ్యం నుంచి గోదావరి నది మీదుగా వచ్చిందా...లేదా అదే అభయారణ్యం విస్తరించి ఉన్న రంపచోడవరం,మారేడుమిల్లి మీదుగా వచ్చిందా? అటవీ శాఖ రకరకాల విశ్లేషణలు చేస్తోంది. రోజుకు వంద కిలో మీటర్లకుపైగా నడిచే చిరుత పులి ఎన్ని రోజుల పాటు నడుచుకుని ఇక్కడకు వచ్చింది? అనే దానిపై అటవీ శాఖలో చర్చ సాగుతోంది. భారీ వర్షాలు, వరద లకు అడవుల్లో చిరుతపులి స్థావరం దెబ్బతింటే అక్కడి నుంచి సురక్షిత స్థావరం వెదికే క్రమంలో దారితప్పి ఉంటుందని అనుమానిస్తున్నారు. చిరుత పులి స్థావరంలోకి పెద్ద పులి వస్తే తక్షణం ఉండే ప్రాంతాన్ని మార్చడం చిరుత లక్షణం కావడంతో ఆ క్రమంలో దారితప్పి ఉంటుందని భావిస్తున్నారు.ఈ క్రమంలో గోదావరిని ఈదుకుంటూ రావడం లేదా రంప అడవుల నుంచి గోకవరం మీదుగా రాజమహేంద్రవరంలోకి వచ్చేసి ఉంటుందని విశ్లేషిస్తున్నారు. ఇంకో పులితో జత కట్టిన తర్వాత ఆడ, మగ పులి విడిపోతాయి.ఇలా మళ్లీ జత కోసం ప్రయత్నించే సమయంలో దారితప్పి నగరంలోకి వచ్చి ఉంటుందని చెబుతున్నారు.గతంలో ఉమ్మడి జిల్లాలకు దారితప్పి వచ్చిన చిరుతల ఘటనలతో పోల్చి విశ్లేషణలు చేస్తున్నారు.

అందుకే కదలడం లేదా...

ఈ ఏడాది ఫిబ్రవరిలో ఏలూరు జిల్లా పరిధిలోకి ఓ మగ పులి పాపికొండలు అభయారణ్యంలోకి వచ్చింది. వంద కిలోమీటర్లకుపైగా నడిచి తిరిగి అభయారణ్యం లోకి వెళ్లిపోయింది. పాపికొండలు అభయారణ్యాన్ని ఆనుకుని కొండలు, గోదావరి నది ద్వారా పులి సంచరించి ఇలా వచ్చిందని అప్పట్లో భావించారు. 2022 మేలో ఓ పులి ఏజెన్సీ మీదుగా ప్రత్తిపాడు, శంఖవరం, తుని రూరల్ మీదుగా వెళ్లింది. ప్రత్తిపాడులో బోనులోకి చిక్కినట్లే చిక్కి తప్పించుకుంది.ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, ఏజెన్సీ ప్రాంతాల మీదుగా విస్తరించి ఉన్న అడవుల నుంచి కొన్నిసార్లు దారితప్పడం వలనే ఈ ఘటనలు చోటుచేసుకుంటున్నట్టు చెప్తున్నారు. ఇప్పుడు రాజమహేంద్రవరంలోకి చిరుతపులి రావడం క్రమేపీ నగరాల్లోకి దారితప్పి వస్తున్న పులుల సంచారం చర్చనీయాంశంగామారింది.రాజమహేంద్రవరంలో సంచరిస్తున్న చిరుత రిజర్వు ఫారెస్టులో ఉంది. అనువైన వాతావరణం ఉండడంతో అక్కడి నుంచి కదలట్లేదని సమాచారం.

10 రోజులైనా చిక్కని చిరుత..

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం శివారులోని 900 ఎకరాల రిజర్వు ఫారెస్టులో పది రోజుల నుంచీ చిరుత హుందాగా సంచరిస్తూ అటవీ అధికారులకు మాత్రం చిక్కడం లేదు. పట్టుకొని తీరుతామని అటవీ అధికారులు.. పట్టుకోండి చూద్దామంటూ చిరుతపులి ప్రతిరోజూ సవాళ్లు విసురుకుంటూనే ఉన్నారు. అటవీ అధికారులు అమర్చిన 50 ట్రాప్ కెమెరాల్లోని ఎక్కడో అక్కడ చిరుత ఫొటోకు ఫోజు ఇచ్చి వెళ్లిపోతోంది. ఆ కెమెరాలను అటవీ సిబ్బంది తనిఖీ చేసే సమయానికి పుణ్యకాలం గడిచిపోతోంది. 50 మంది సిబ్బందితో కూడిన బృందాలు ఏ ప్రయత్నాలు చేస్తున్నా నాలుగు బోన్‌లలో ఒక్క దాంట్లోకీ చిరుత దూరడం లేదు. థర్మల్ డ్రోన్‌ని వినియోగించినా ఫలితం కానరావడం లేదు. లాలాచెరువు హౌసింగ్ బోర్డు, ఆటోనగర్, దివాన్ చెరువు, శ్రీరాంపురం తదితర ప్రాంతాల ప్రజలు మాత్రం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం ప్రణాళికలు..విశ్లేషణలు.. ప్రకటనల మాట ఎలా ఉన్నా భయభ్రాంతులకు గురవుతున్నారు.

ఎలా వచ్చిందంటే...



పాపికొండలు అభయారణ్యం నుంచే చిరుతపులి దారితప్పి వచ్చిందని చెబుతున్నారు. ఎందుకంటే పులులు, చిరుత పులులకు పాపికొండలు అభయారణ్యం పెట్టింది పేరు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, అల్లూరి సీతారామరాజు జిల్లా వీటి పరిధిలోని ఏజెన్సీ కలిపి మొత్తం 1.02 లక్షల హెక్టార్లు అంటే 2.60 లక్షల ఎకరాలు.ఈ కొండల మధ్యలో గోదావరి ఉంది. ఈ అభయారణ్యం పులులకు ఆవాసం. మూడేళ్లకోసారి కెమెరా ట్రాప్ ద్వారా పులుల లెక్కింపును అధికారులు చేపడతారు. ఇటీవల ఈ అభయారణ్యంలో అధికారులు రెండు దశల్లో 232 ట్రాప్ కెమెరాలతో 116 ప్రాంతాల్లో సర్వే చేయగా నాలుగు పెద్దపులులు,ఆరు చిరుత పులులు ఉన్నట్టు గుర్తించారు. ట్రాప్ కెమెరాకు చిక్కని చిరుత పులులు మాత్రం ఇంకో 12 వరకు ఉండొచ్చని అంచనా. రంపచోడవరం, మారేడుమిల్లి అడవుల్లోనూ చిరుతల సంచారమే అధికమని అక్కడ పనిచేసిన అటవీ అధికారులు చెప్తున్నారు. రాజమహేంద్రవరంలోకి దారితప్పి వచ్చిన చిరుత పాపికొండలు అభయారణ్యం నుంచే వచ్చిందని చెబున్నారు. ఇటీవల గోదా వరికి వరద పోటెత్తడంతో అడవుల్లో చిరుత స్థావరం చెల్లాచెదురై కొత్త స్థావరం కోసం వెదికే క్రమంలో గోదావరి ఈదుకుంటూ రాజమహేంద్రరంలోకి వచ్చి ఉండొచ్చని అంచనా. పాపికొండలు అభయారణ్యం విస్తరించిన ఏజెన్సీ ప్రాంతంలోను వీఆర్‌పురం, రంపచోడవరం, మారేడుమిల్లి, గోకవరం మీదుగా చిరుత రాజమహేంద్రవరంలోకి దారి తప్పి వచ్చి ఉండొచ్చని చెప్తున్నారు.ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి పోలవరం ప్రాజెక్టు మీదుగా రంప ఏజెన్సీ వరకు విస్తరించి ఉన్న పాపికొండలు అభయారణ్యంలో ఎటువైపైనా పులులు దారి తప్పవచ్చని విశ్లేషిస్తున్నారు.

చిరుత కంటే తక్కువ ఎత్తు ఉంటేనే దాడి..

పులి, చిరుత పులికి చాలా వ్యత్యాసాలున్నాయి. పులి జాడ ఉన్న చోట చిరుతపులి పెద్దగా ఉండదు. కానీ చిరుతపులితో పోల్చితే పులి చాలా తెలివైనది. ఇది పెద్దగా జనావాసాల్లోకి రాదు. ఒకేచోట ఎక్కువగా ఉంటుంది.చిరుత అలా కాదు. ఇది నిరంతరం తిరుగుతూనే ఉంటుంది. వంద కిలోమీటర్లు అవలీలగా నడిచేస్తుంది. పులి కేవలం ఆకలి వేస్తేనే వేటాడుతుంది. చిరుతపులి అలా కాదు.చిరుత లక్షణం నిరంతరం ఏదొకటి వేటాడుతూ తింటూ ఉండడమే. ఇది తక్కువ ఎత్తయిన జంతువులు పంది,కుక్కలను వేటాడి తింటుంది. ఎత్తయిన జంతువులను చిరుత వేటాడలేదు. మనుషులు ఎత్తుగా ఉండడం వల్ల మనుషులను చూస్తే చిరుత కొంత భయపడుతుంది.అదే కూర్చుని ఉంటే తక్కువ ఎత్తు వల్ల సులువుగావేటాడుతుందనిఅటవీ అధికారులు విశ్లేషించారు.

- రాజమహేంద్రవరంలోనే చిరుత
- ఇంకా కొనసాగుతున్న అన్వేషణ
- పాపికొండలు అభయారణ్యం నుంచే రాక?
- ఇక్కడకు రావడానికి కారణాలపై విశ్లేషణలు
- ఎలా వచ్చిందనే దానిపై ఇంకా అస్పష్టత
- పులి కంటే చిరుతపులే ప్రమాదకరం
- ఆకలి వేసినప్పుడే పులి వేట..
- చిరుతది నిరంతర వేట

పిల్లలను బయటకు రానీయవద్దు : డీఎఫ్‌వో

దివాన్‌చెరువు, సెప్టెంబరు 15: దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో అమర్చిన ట్రాప్ కెమెరాలో ఆదివారం తెల్లవారుజామున చిరుతపులి కదలిక చిత్రాలు కనిపించాయని ఇన్‌చార్జి డీఎఫ్‌వో ఎస్.భరణి తెలిపారు. ప్రస్తుతం చిరుతపులి దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోనే ఉందని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హౌసింగ్‌బోర్డుకాలనీ,ఆటోనగర్, దివాన్‌చెరువు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న ఏరియాల్లో పిల్లలను తల్లిదండ్రులు సాయంత్రం 6 గంటల తర్వాత బయటకు తిరగకుండా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు.

సంఘాలకు సహకారం

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 50 చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు
- ఈ నెల 21 నుంచి ప్రక్రియ మొదలు
- డిసెంబర్ 6న కొలువుదీరనున్న కొత్త పాలక వర్గాలు
- ఐదేళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వం
- ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు

కార్పొరేషన్(కాకినాడ), అమలాపురం రూరల్ సెప్టెంబర్ 15: వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన చేనేత సహకార సంఘాలకు పునర్జీవం పోసే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత ఐదేళ్లు ఎన్నికలు నిర్వహించకుండా వైసీపీ ప్రభుత్వం అధికారుల కమిటీలతో సరిపెట్టింది. ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా దెబ్బతీసింది. అంతకుముందు అమలైన పథకాలను సైతం నిలిపి వేసి కోలుకోలేని దెబ్బ తీసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మూడు నెలల్లోనే ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. జిల్లాలో ఎన్నికల అధికారుల నియామకంతో ఈనెల 21 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. డిసెంబర్ 6న కొత్త పాలకవర్గాలు కొలువు దీరనున్నాయి.

50 చేనేత సహకార సంఘాలు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన చేనేత సంఘాలు 50వరకు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 18, తూర్పుగోదావరి జిల్లాలో 9, అంబేద్కర్ కోనసీమలో 23 చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో చాలా వరకు నిర్లిప్తంగా ఉన్నాయి.

తొమ్మిది మంది సభ్యులతో..

చేనేత సహకార సంఘాలకు ఆంధ్రప్రదేశ్ సహకార చట్టం ప్రకారం చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఒక్కో సంఘానికి తొమ్మిది మంది సభ్యులతో పాలకవర్గాన్ని ఎన్నుకోనున్నారు. వీరిలో నుంచే అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటారు. తొమ్మిది మంది సభ్యుల్లో ఇద్దరు కచ్చితంగా మహిళలు ఉండాలి. ఎన్నికల్లో నిల్చునేందుకు, ఓటు వేయడానికి సభ్యులు 300 షేరు ధనం కలిగి ఉండాలి. అలాగే మూడు నెలల నుంచి సొసైటీకి ఎటువంటి బకాయిలు ఉండకూడదని జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ పెద్దిరాజు 'ఆంధ్రజ్యోతి' తెలిపారు. పాలకవర్గాల నియామకంతో చేనేత సంఘాల బలోపేతానికి అవకాశముందని సంఘాల్లోని కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయన్నారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో అమలైన యార్న్ సబ్సిడీ, మార్కెట్ ఇన్సెంటివ్, రిబేట్, ముద్ర రుణాలు, థ్రిఫ్ట్ ఫండ్ తదితర పథకాలను పునరుద్ధరిస్తామని ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో వీటిని గరిష్ఠంగా వినియోగించుకునేందుకు పాలకవర్గాల ద్వారా సంఘాల్లోని కార్మికులకు అవకాశం కలగనుంది.

గత ఐదేళ్లుగా ఎన్నికల కోసం ఎదురుచూపులు

2013 ఫిబ్రవరిలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో చేనేత సహకార సంఘం ఎన్నికలు జరిగాయి. 2018 ఫిబ్రవరితో పాలకవర్గం సమయం ముగిసింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం చేనేత రంగాన్ని పూర్తిగా విస్మరించడంతో దిక్కు తోచని స్థితిలో ఇప్పటి వరకు చేనేత కార్మికులు ఉన్నారు. అయితే ఇప్పుడు చేనేత సహకార సంఘాలకు కూటమి ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడంతో చేనేత కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే సహకార సంఘాల ఎన్నికల కోసం అధికారులు సమాయతమవుతున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

జడ్.రాగంపేటలో 3884 కిలోల బియ్యం, వాహనం సీజ్



జడ్.రాగంపేట వద్ద పట్టుకున్న పీడీఎస్ బియ్యం, వాహనం వద్ద అధికారులు

గండేపల్లి, సెప్టెంబర్ 15: మండలంలోని జడ్.రాగంపేట గ్రామంలో పెట్రోల్ బంక్ సమీపంలో జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. వ్యాన్‌లో ఉన్న బియ్యాన్ని తనిఖీ చేయగా అవి పీడీఎస్ బియ్యంగా గుర్తించి స్వాధీనపరచుకున్నారు. రీజనల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ 93 బస్తాల్లో సుమారు 3884 కిలోల బియ్యాన్ని గుర్తించామన్నారు. ఈ బియ్యం కిర్లంపూడి మండలానికి చెందిన నల్లం శెట్టి లక్ష్మీనారాయణకు చెందినదిగా తెలిపారు. కిర్లంపూడి మండలం గోనేడ గ్రామం నుంచి దివాన్ చెరువు ప్రాంతంలోని పౌల్ట్రీ ఫారాలకు రవాణా చేస్తుండగా పక్కా సమాచారంతో పట్టుకున్నామన్నారు. రవాణాకు ఉపయోగించిన వాహనాన్ని స్వాధీన పరచుకుని డ్రైవర్ అరట గంగాధర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. బియ్యం, వాహనం విలువ రూ.11,28,714గా తెలిపారు. దీనిపై సివిల్ సప్లయ్స్ అధికారులు 6ఏ కేసు నమోదు చేసి అక్రమంగా తరలిస్తున్న వారినపై క్రిమినల్ కేసుల నమోదు కోసం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు నాగవెంకటరాజు, వీరబాబు, లోవరాజు, సీఎస్‌టీడీ కృష్ణ పాల్గొన్నారు.

'ఆ సొమ్ములు చెల్లిస్తున్నాం'

- కలెక్టర్ ప్రశాంతి

దివాన్‌చెరువు, సెప్టెంబరు15 : రాజానగరం మండలం జి.ఎర్రంపాలెం బ్యాంకు ఆఫ్ బరోడా బ్రాంచి (బీఓబీ) లో దుర్వినియోగమైన సొమ్ము రూ67.52 లక్షలను ఈనెల 17వ తేదీ మంగళవారం నుంచి బ్రాంచి నందు చెల్లింపులు జరుపుతామని జిల్లాకలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. . జి.ఎర్రంపాలెం బీఓబీ బ్రాంచ్‌కు చెందిన వ్యాపార కరస్పాండెంట్ ముత్యాబత్తులనానిబాబు ద్వారా కస్టమర్ల డిపాజిట్ల సొమ్ము దుర్వినియోగమైనట్టు గుర్తించామన్నారు. సంబంధిత ఖాతాదారులకు ఆ మొత్తాన్ని చెల్లించాలని బ్యాంకుఅధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈనెల 17 నుంచి జి.ఎర్రంపాలెం బ్రాంచ్‌లో డీఆర్‌డీఏ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. దుర్వినియోగమైనట్టుగా గుర్తించిన రూ.67.52 లక్షలను ఎం/ఎస్ విజన్ ఇండియా టెక్ సర్వీసెస్ లిమిటెడ్ నుంచి వసూలు చేసి బాధిత ఖాతాదారులకు ఆయా మొత్తాలను రీయింబర్స్ చేయనున్నట్లు బ్యాంకు అధికారులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారని కలెక్టర్ తెలిపారు. ఇందులో పుణ్యక్షేత్రానికి చెందిన 15 ఖాతాలకు సంబంధించి రూ26,69,000, కొండగుంటూరు పాకలకుచెందిన రెండు ఖాతాలకు రూ.81 వేలు, సంపత్‌నగరానికి చెందిన 6 గ్రూపుల ఖాతాలకు రూ.5,45,000, జి.ఎర్రంపాలేనికి చెందిన 41 ఖాతాలకు రూ34,11, 757లు దుర్వినియోగమైనట్టుగా గుర్తించామని డీఆర్‌డీఏ పథకసంచాలకులు ఎన్‌వీవీఎస్ మూర్తి తెలిపారని కలెక్టర్ పేర్కొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



కంచుగరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

అంతర్వేది, సెప్టెంబరు 15: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. చివరి రోజు ఆదివారం స్వామి, అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నవనారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు పరిపూర్ణమయ్యాయి. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, అభిషేకం, అలంకార తిరుమంజనం, ప్రాయశ్చిత హోమం, మహాశాంతి హోమం, పరమాత్మికోపనిషత్తు, శేషహోమం, పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం కంచు గరుడ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామపురవీధుల్లో స్వామి-అమ్మవార్ల ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. పవిత్ర అవరోహణ, విశేషార్చన, నీరాజన మంత్రపుష్పాలు, పవిత్రముల వినియోగం జరిగాయి. కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరాజగోపాలరాజాబహదూర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, గొట్టుముక్కల భీమరాజు, నల్లా సత్యకృష్ణకిరణ్‌ప్రసాద్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా అంతర్‌జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

బాలురు విభాగంలో చిత్తూరు.. బాలికల విభాగంలో విశాఖ విజయం



విజేతలకు షీల్డ్‌లు అందజేస్తున్న ఈవో రామచంద్రమోహన్, యనమల రాజేష్

అన్నవరం, సెప్టెంబరు 15: మూడురోజులుగా కాకినాడ జిల్లా అన్నవరంలో జరుగుతున్న అంతర్ జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీల ఫైనల్స్ ఉత్కంఠ భరితంగా జరిగాయి. బాలుర విభాగంలో చిత్తూరు, శ్రీకాకుళం, విశాఖ, కడప జిల్లాలు వరుసగా తొలి నాలుగు స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో విశాఖపట్నం, గుంటూరు, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జట్లు వరుసగా మొదటి నాలుగు స్థానాల్లో నిలిచినట్లు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ముప్పన వీర్రాజు తెలిపారు. అన్ని టీంలలో ప్రతిభకనబరిచిన వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుగా ఎంపికచేశారు. బాలుర రాష్ట్ర జట్టులో శ్రీకాకుళానికి చెందిన ఎన్.ప్రవీణ్‌కుమార్, జి.చాయకిరణ్, చిత్తూరుజిల్లాకు చెందిన వి.సి హేమచరణ్, కె.తేజేష్, కడపనుంచి కౌశిక్, తూర్పుగోదావరి నుంచి సుదర్శన్, విశాఖ నుంచి పైడినాయుడు, కర్నూల్ నుంచి తేజస్వీరెడ్డి, అనంతపూర్ నుంచి రాజశేఖర్, కృష్ణానుంచి శైలేంద్రకుమార్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో గుంటూరు నుంచి ఎం లుధియా, దేవమణి, తూర్పుగోదావరి నుంచి కుమారి, మానస ప్రణతి, విశాఖ నుంచి కీర్తన, శ్రీకాకుళం నుంచి జ్యోత్స్న చిత్తూరు నుంచి ప్రశాంతి, పశ్చిమగోదావరి నుంచి అనూషలు ఎంపికయ్యారు. వీరు రాష్ట్రం తరఫున హర్యానాలో జరిగే పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారు. విజేతలకు దేవస్థానం ఈవో రామచంద్రమోహన్, టీడీపీ నేత యనమల రాజేష్ షీల్డ్‌లు అందజేశారు.

నరాలు తెగే ఉత్కంఠతో..



హోరాహోరీగా పవర్ లిఫ్టింగ్ చేస్తున్న క్రీడాకారులు



విజేతలుగా నిలిచిన క్రీడాకారిణులు

- పురుషుల విభాగంలో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు
- మహిళా విజేతలకు పతకాలు అందజేత
- స్ట్రాంగ్ ఉమెన్‌లుగా శ్రావణి, సాదియాఅల్మాస్, అనూష

అమలాపురం టౌన్, సెప్టెంబరు 15: అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్, కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక భూపయ్య అగ్రహారంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో రెండో రోజు ఆదివారం రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు పురుషుల విభాగంలో జరిగాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 455 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు, జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అర్ధరాత్రి వరకు పవర్ లిఫ్టింగ్ పోటీలు కొనసాగుతున్నాయి.

స్ట్రాంగ్ ఉమెన్లుగా శ్రావణి, సాదియాఅల్మాస్, అనూష

11వ రాష్ట్రస్థాయి మహిళల పవర్ లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ చాంపియన్ షిప్ పోటీల్లో మహిళా విజేతల వివరాలను వెల్లడించారు. మహిళల సబ్‌జూనియర్స్ విభాగంలో 70 పాయింట్లతో కడప జిల్లా ప్రథమ, 45 పాయింట్లతో గుంటూరు ద్వితీయ, 37 పాయింట్లతో విజయనగరం జిల్లా తృతీయస్థానాన్ని సాధించింది. జూనియర్ మహిళల విభాగంలో 56 పాయింట్లతో గుంటూరు ప్రథమ, 47 పాయింట్లతో విజనగరం ద్వితీయ, 21 పాయింట్లతో ప్రకాశం తృతీయస్థానం సాధించింది. సీనియర్ మహిళల విభాగంలో గుంటూరు జిల్లా 70 పాయింట్లతో ప్రథమస్థానం, తూర్పుగోదావరి జిల్లా 33 పాయింట్లతో ద్వితీయస్థానం, 21 పాయింట్లతో ఎన్టీఆర్ జిల్లా తృతీయస్థానం సాధించింది. అనంతరం స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్స్‌ను ప్రకటించారు. సబ్ జూనియర్ బాలికల విభాగంలో పి.శ్రావణి (గుంటూరు) ప్రథమ, పి.వందన (కోనసీమ) ద్వితీయ, హర్షితతివారి (వైఎస్సార్‌కడప) తృతీయ స్థానంతో స్ట్రాంగ్ ఉమెన్‌లుగా నిలిచారు. జూనియర్ మహిళ విభాగంలో ఎస్కే. సాదియాఅల్మాస్ (గుంటూరు) ప్రథమ, ఎం.షానూన్ (గుంటూరు) ద్వితీయ), ఎస్కే. సబీనా (గుంటూరు) తృతీయస్థానంతో స్ట్రాంగ్ ఉమెన్లుగా నిలిచారు. సీనియర్ మహిళల విభాగంలో డి.అనూష(ఎన్టీఆర్) ప్రథమ, బి.చంద్రిక(గుంటూరు) ద్వితీయ, ఎస్కే. సాదియాఅల్మాస్ (గుంటూరు) తృతీయ స్థానాలతో స్ట్రాంగ్ ఉమెన్లుగా నిలిచారు. మహిళల విభాగంలో వివిధ కేటగిరీల్లో నిర్వహించిన పోటీల్లో వరుస స్థానాలు సాధించిన పవర్ లిఫ్టర్లకు అసోసియేషన్ల పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో అల్లాడ శరత్‌బాబు, డీవీ రమణ, ఎంఎస్ఎన్ మూర్తి, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, యేడిద శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంటిలో నిద్రిస్తుండగానే..

చోరీకి పాల్పడిన దొంగ

మెయిన్ డోర్ పగులగొట్టి 90గ్రాముల బంగారం, రూ.3 వేల నగదు అపహరణ

అనపర్తి, సెప్టెంబరు 15 : అనపర్తిలో వరలక్ష్మి టవర్స్‌లో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలోనే ఈ చోరీ జరిగిందని అనపర్తి ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. స్థానిక బాలుర ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న కాకి సత్య సునీత తన భర్తతో కలిసి అనపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని వరలక్ష్మి టవర్స్‌లో నివసిస్తున్నారు. శనివారం రాత్రి ఇంటి తాళాలు వేసుకుని ఒక బెడ్ రూమ్‌లో నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారు జాము సమయంలో ముసుగు వేసుకున్న ఓ వ్యక్తి మెట్ల మార్గం ద్వారా వీరు ఉంటున్న ప్లాటు వద్దకు చేరుకుని మెయిన్ డోర్‌ను పగులగొట్టి లోనికి ప్రవేశించాడు. దంపతులు నిద్రిస్తున్న పక్క గదిలోకి ప్రవేశించి చాకచక్యంగా లాకర్‌ను పగులగొట్టి లాకర్‌లో ఉన్న సుమారు 90 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.మూడు వేల నగదు దోచుకుపోయాడు. తెల్లవారిన తరువాత విషయం తెలుసుకున్న దంపతులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శివగణేష్, ఎస్ఐ శ్రీను నాయక్‌లు సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్‌కు సమాచారం అందించడంతో వారు వేలి ముద్రలను సేకరించారు. చోరీకి గురైన బంగారం విలువ సుమారు రూ.ఐదు లక్షల వరకు ఉంటుందని బాధితులు వాపోతున్నారు. బాధితురాలు సత్యసునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు.

తగ్గుతున్న గోదావరి

ధవళేశ్వరం, సెప్టెంబరు15: గోదావరి పరిస్థితి తగ్గుముఖం పట్టింది. సాయంత్రానికి గోదావరి నీటిమట్టం 9.50 అడుగులకు చేరుకోగా 6,90,849 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. ఎగువన భద్రాచలం వద్ద నీటి మట్టం 35.30 అడుగులకు చేరుకుంది.


గంగమ్మ ఒడికి.. గణపయ్య

గణపతి నవరాత్రమహోత్సవాల ముగింపు సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వినాయక నిమజ్జన కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయి. చవితి పందిళ్లలో కొలువుదీరిన బొజ్జగణపయ్యలను ఊరేగింపు నడుమ గంగమ్మ ఒడికి చేర్చారు. సందడి వాతావరణంలో 'ఓ బొజ్జ గణపయ్యా.. వెళ్లి రావయ్యా' అంటూ సాగనంపారు. యువతీయువకులు, చిన్నారులు, పెద్దలు ఈ నిమజ్జన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆ దృశ్యాలివే..





రాజమహేంద్రవరంలోని వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు



రాజమహేంద్రవరంలో గంగమ్మ ఒడికి చేరిన గణేశుడు



ప్రత్తిపాడులో గణేశ్ నిమజ్జనానికి తరలివెళుతున్న భక్తులు



కొత్తపల్లి మండలం ఉప్పాడ బీచ్‌లో వినాయకుడి ప్రతిమతో..



రాజమహేంద్రవరంలో గోదావరి చెంత నిమజ్జనానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

కిర్లంపూడి, సెప్టెంబర్ 15: కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం పాలెం గ్రామంలో వినాయక నిమజ్జనంలో అపశ్రుతి జరిగింది. వీరవరం గ్రామానికి చెందిన బి.లక్ష్మణరావు(33) ఏలేరు కాలువలో నిమజ్జనానికి వెళ్లి ప్రమాదవశాత్తూ బొమ్మకింద పడి మృతిచెందాడు. విషయాన్ని గ్రహించి గత ఈతగాళ్లు అతడిని బయటకు తీసి సీపీఆర్ చేసినా ఫలించలేదు. నీళ్లు ఎక్కువగా తాగడం వల్ల మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలిసిన జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, కిర్లంపూడి ఎస్ఐ సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బంధువులకు సమాచారం అందడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గణేశ్ నిమజ్జనాల్లో ఘర్షణ

కొత్తపల్లి, సెప్టెంబరు 15: గణేష్ నిమజ్జన వేడుకల్లో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలైన సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం రమణక్కపేటలో జరిగింది. గణేష్ నవరాత్రులు ముగింపు సందర్భంగా ఆదివారం వినాయకుని నిమజ్జనం చేసేందుకు స్థానిక టీడీపీ నాయకుడు, ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పెనుమల్లు సుభాకర్‌రెడ్డి వర్గం, వైసీపీ వర్గం నుంచి చింతపల్లి లక్ష్మీరెడ్డి ఊరేగింపుగా వెళ్లి ఊరి చివర ఉప్పుటేరులో వినాయకున్ని నిమజ్జనం చేశారు. వైసీపీ జెండాలతో గణేష్ నిమజ్జన ఊరేగింపు నిర్వహించడాన్ని టీడీపీ నాయకుడు సుభాకర్ రెడ్డి ఖండించారు. దీనికి కోపోద్రిక్తుడైన వైసీపీ నాయకుడు లక్ష్మీరెడ్డి కర్రతో సుభాకర్‌రెడ్డిని విచక్షణారహితంగా శరీరంపై కొట్టడంతో తట్టు తేలాయి. సుభాకర్ రెడ్డిని అడ్డుకోవడానికి వెళ్లిన పెనుమల్లు రాజుకు కూడా ఖరదెబ్బలు తగలడంతో ఇరువురు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గాయాలైన వ్యక్తులను చికిత్స కోసం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన గ్యాస్ సిలిండర్ల లారీ

రాజానగరం, సెప్టెంబరు 15 : అనపర్తి నుంచి గుమ్మళ్లదొడ్డికి గ్యాస్ సిలిండర్లతో వస్తున్న లారీ మార్గమధ్యలో రాజానగరం మండలం తోకాడ గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తూ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని, కిళ్లీ దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు చెబుతున్నారు. తనకు నీరసంతో కళ్లు తిరిగినట్లుగా అనిపించడం వల్లే లారీ అదుపుతప్పినట్లు డ్రైవర్ చెబుతున్నాడు. ఖాళీ సిలిండర్లు కావడం, ఎవరికి ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పోలియో టీకా అధిక డోస్ : పసికందు మృతి

దేవీపట్నం, సెప్టెంబర్ 15: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండలంలోని ఇందుకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో లోతుపాలెం గ్రామానికి చెందిన రెండు నెలల పసికందు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలియో టీకా అధిక డోస్ వేయడంవల్లే మృతి చెందినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఆశా వర్కర్, ఆసుపత్రి నర్సు నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందంటున్నారు. దీనికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

తేటగుంటలో పేకాట శిబిరంపై దాడి

తుని రూరల్, సెప్టెంబరు 15: కాకినాడ జిల్లా తేటగుంటలో పేకాట శిబిరంపై రూరల్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని పేకాట స్థావరంలో కుర్చీలు, టేబుల్, రూ.83,950లు సీజ్ చేసినట్టు ఎస్ఐ కృష్ణమాచార్యులు తెలిపారు. పట్టుబడిన వారిలో పలువురు వైసీపీ కీలక నాయకులు ఉండటం విశేషం. కేసు నమోదు చేసిన రూరల్ ఎస్ఐ పేకాట, గుండాట, కోడిపందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవనిహెచ్చరించారు.

కారు ఢీ కొని కళాకారుడి మృతి

ప్రత్తిపాడు, సెప్టెంబరు15: ప్రత్తిపాడ-ధర్మవరం 16వ నెంబరు జాతీయ రహదారిపై రాచపల్లి అడ్డురోడ్డు వద్ద చిన్నకారు ఢీ కొన్న దుర్ఘటనలో అనకాపల్లికి చెందిన కళాకారుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. అనకాపల్లికి చెందిన 15 మంది తీన్‌మార్ కళాకారుల బృందం గుంటూరులో ప్రదర్శన ఇచ్చేందుకు శనివారం రాత్రి బయల్దేరారు. ఈ వ్యాన్ జాతీయ రహదారి రాచపల్లి అడ్డురోడ్డు వద్దకు చేరుకోగా అనకాపల్లికి చెందిన కళాకారుడు బి.అప్పారావు(45)అల్పాహారం కోసం హైవే రోడ్డు దాటి దాబా హోటల్ వద్దకు వెళ్లాడు. టిఫిన్ కట్టించుకుని తిరిగి రోడ్డు దాటుతుండగా అన్నవరం నుంచి రాజమండ్రి వెళ్లే కారువేగంగా అప్పారావును ఢీకొంది. ఈ సంఘటనలో కారు ఢీ కొన్న అప్పారావును తోటి కళాకారులు వారు వచ్చిన వాహనంలో ప్రథమ చికిత్స కోసం ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. అప్పారావు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున అప్పారావు మృతి చెందాడు. దీనిపై ఎస్ఐ ఎం. పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడలో వ్యక్తి అనుమానాస్పద మృతి

కాకినాడ క్రైం, సెప్టెంబరు 15: ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన ఆదివారం కాకినాడలో జరిగింది. త్రీటౌన్ సీఐ కేవీవీ సత్యనారాయణ కథనం ప్రకారం.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం, వీరవల్లిపాలేనికి చెందిన ముద్రగడ ఈశ్వరదుర్గాప్రసాద్ (39) కు భార్య నీలకంఠమణి, ఓ కుమారుడు ఉన్నారు. కాగా అతను కాకినాడలో లారీ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఏడాది క్రితం జీవనోపాధి నిమిత్తం భార్య, కుమారుడితో కలిసి హైదరాబాద్ వెళ్లి పోయాడు. అయితే రెండు నెలల క్రితం భార్య, కుమారుడిని అక్కడ వదిలేసి స్వగ్రామానికి వచ్చి- తిరిగి హైదరాబాద్ వెళుతుండేవాడు. ఇది ఇలా ఉండగా కత్తుల దుర్గ అనే మహిళతో కాకినాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీధిలో కాస్మోహోటల్ పక్కన ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో ఏమైందో కాని ఆదివారం ఆ ఇంటి ప్రాంగణంలో ఈశ్వరదుర్గాప్రసాద్ ఒంటిపై దెబ్బలతో విగత జీవిగా పడిఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు కాకినాడ ఎస్‌డీపీఓ రఘువీర్ విష్ణు, సీఐ సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురికి తరలించారు. హత్యకు దారి తీసిన కారణాలు తెలియాల్సి ఉంది. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, సెప్టెంబరు 15: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ఇరువురు దాతలు రూ రెండు లక్షలు విరాళంగా అందజేశారు. జగ్గంపేటకు చెందిన బొండా సుబ్బరాజు రూ.లక్షను పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. కందుకూరుకు చెందిన మరోదాత ఎం.శ్రీకాంత్ రూ.లక్ష అన్నదాన విభాగ సూపరింటెండెంట్ కంచి మూర్తికి అందించగా వారు దాతలను అభినందించి స్వామివారి ప్రత్యేకదర్శనం, ప్రసాదాలు అందజేశారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

EDUCATION

అన్ని Correspondence Courses కు, C.P.T (C.A), B.A, B.Com, Polytechnic Maths కు కోచింగ్ ఇవ్వబడును. దుర్గారమణమూర్తి కామర్స్, ఆర్ట్స్ & మేథమెటిక్స్ 27-4-15 opp C.M.R Jewellers Fed Bank Ltd వెనుక, దేవాలయం వీధి కాకినాడ సెల్: 9581261953

AJD:199511

WANTED

69 సం॥ కొంచెం మతి మరుపు వ్యక్తికి వంటకు మరియు వ్యాపారమునకు సహాయరాలు కావలెను. సంప్రదించండి సెల్ నెం : 7569879199.

AJG-191850

CHANGE OF NAME

★ I BANDARU SRI VENKATA PHANI SATYA GOWRI KARTHEEKI Alias POLISETTI SRI VENKATA PHANI SATYA GOWRI KARTHEEKI W/O BANDARU RAJA residing at 2-422, OLD PANCHAYATHI VEEDHI,VADAPALEM, KOTHAPETA EAST GODAVERI, ANDHRA PRADESH-533223,have changed my name to GOURI KARTHEEKI POLISETTI for all Future Purposes. AJH-54633

4 Lines CLASSIFIED Rs.230/- Only

వేదపఠనంతో ఆ ప్రాంతం సస్యశ్యామలం

అంబాజీపేట, సెప్టెంబరు 15: నిత్యం వేదపఠనం జరిగే ప్రాంతమంతా సస్యశ్యామలంగా ఉంటుందని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రముఖ వేద పడింతులు వడ్లమాని సుబ్రహ్మణ్యఘనాపాఠి, కాశీపతి ఘనాపాఠిలు అన్నారు. అంబాజీపేట సత్యసాయినగర్‌లో ఏర్పాటుచేసిన శ్రీబాలగణపతి మందిరం వద్ద తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం వేద ప్రవచనాన్ని ఏర్పాటు చేశారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామివారి ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.

- ఆలయాల వద్ద అన్నసమారాధనలు
- గణనాథుల లడ్డూలకు వేలం పాటలు
- ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు





ముమ్మిడివరం: అన్నంపల్లిలో గణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం, ఉప్పలగుప్తం:గణపతి లడ్డూతో పాటదారులు

ముమ్మిడివరం, సెప్టెంబరు 15: అన్నంపల్లిలోని సిద్ధివినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. వేదపండితులు పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో పదకొండు మంది పురోహితుల మంత్రోశ్చరణల నడుమ గణపతికి పంచామృత అభిషేకం, గణపతి హోమం, లక్ష గరికపూజ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో జగతా రామకృష్ణ, ఇండుగుల కాశీవిశ్వేశ్వరరావు, ఇండుగుల వెంకటప్పనాయుడు, ఇండుగుల రాజా, సాయి, ఈశ్వరరావు, నాగేశ్వరరావు, బళ్ల చిన్నీ, రాయపురెడ్డి ఏడుకొండలు, బాబీ, ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ వేలం పాటలు

మామిడికుదురు, సెప్టెంబరు 15: మొగలికుదురు పంచాయతీ జిన్నూరు నగర్‌లోని పృధ్వీవినాయక మందిరం వద్ద లడ్డూకు వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన రుద్ర శ్రీనివాసరావు రూ.47,600కు లడ్డూను పాడుకున్నారు. పెదపట్నంలంకలోని ధనంపేటలో ఐదు కిలోల లడ్డూను మల్లాడి లక్ష్మీనారాయణ రూ.18వేలకు కైవసం చేసుకున్నాడు. మరో లడ్డూను మల్లాడి రంగారావు రూ.12వేలకు దక్కించుకున్నాడు. అప్పనపల్లి బాలబాలాజీ ఆలయం వద్ద, మామిడికుదురు బుల్లోడు వంతెన వద్ద ఏర్పాటుచేసిన మండపం వద్ద భారీ అన్నసమారాధనలు జరిగాయి. మామిడికుదురులోని హైస్కూలు రోడ్డులో గల లక్ష్మీగణతి ఆలయం వద్ద ఆలయ నిర్మాత వాసంశెట్టి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో తొమ్మిదిరోజులు ప్రత్యేక పూజలు చేశారు.

గణపతి మందిరాల్లో అన్నసమారాధనలు

పి.గన్నవరం, సెప్టెంబరు15: ముంగండ శ్రీలక్ష్మీగణపతి వీధిలో గణపతి మందిరంలో శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో శ్రీవాసవి ఆర్యవైశ్య సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. లంకలగన్నవరం లాకు వద్ద వినాయకుని ఆలయం వద్ద యర్రంశెట్టి బ్రదర్స్ ఆర్థికసాయంతో నిర్వహించిన భారీ అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. అదే విధంగా పోతవరం గణేష్ సెంటర్, నాగుల్లంక తదితర ప్రాంతాలలో వినాయకుని ఆలయాలు వద్ద భారీ అన్నసమారాధనలు నిర్వహించారు.

లడ్డూ వేలం

కాట్రేనికోన, సెప్టెంబరు 15: స్థానిక మావుళ్ళమ్మ గుడి సమీపంలో బాలల ఆధ్వర్యంలో జరిగిన బాలగణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన వేలం పాటలో ఒక లడ్డూను రూ.1400కు, మరో లడ్డూను రూ.1400కు భక్తులు దక్కించుకున్నారు. ఆకొండి శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో గణపతికి గరికపూజ నిర్వహించారు.

వినాయక ఊరేగింపులు, నిమజ్జనాలు

అల్లవరం, సెప్టెంబరు 15: గణపతి నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా అల్లవరం మండలంలోని పలు గ్రామాల్లో గణనాథుల విగ్రహాలను ఊరేగించి నిమజ్జనాలు చేశారు. మొగళ్లమూరులో మాజీ ఎంపీ చింతా అనురాధ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. గోడితిప్ప, యెంట్రుకోన, కోడూరుపాడు, గోడిపాలెం, గోడి, అల్లవరం, తూర్పులంక తదితర గ్రామాల్లో గణేష్ విగ్రహాలను ఊరేగించి నిమజ్జనాలను చేశారు. అన్నసమారాధనలకు భక్తులు పోటెత్తారు.

మహాలక్ష్మి గణపతి ఆలయంలో భారీ అన్నదానం

యానాం, సెప్టెంబరు 15: యానాం బెజవాడ గార్డెన్స్‌లోని ఉన్న మహాలక్ష్మి గణపతి ఆలయంలో ఆదివారం భారీ అన్నసమా రాధన నిర్వహించారు. స్థానిక మహిళలు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. స్థానిక కురసాంపేటలోని అబ్దుల్ కలాంనగర్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో గరికపూజ నిర్వహించారు. జీఎంసీ బాలయోగినగర్‌లోని వరసిద్ధి విపాచర ఆలయం వద్ద మూడు లడ్డులకు వేల పాట నిర్వహించారు. 10కిలోల లడ్డును రూ.12వేలు, 5కిలోల లడ్డును రూ.8వేలు, కిలో లడ్డును రూ.వేలకు పాలగిరి సుధాకర్‌రెడ్డి పాటలో దక్కించుకున్నారు.

వినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, సెప్టెంబరు15: మండపేట తర్పాణిపేటలో వినాయకుడిని ఎమ్మెల్యే వేగుళ్లజోగేశ్వరరావు దర్శించుకుని పూజలు చేశారు. 4వ వార్డు కౌన్సిలర్ గుండు రామతులసీ, తాతరాజు వేగుళ్లకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీడీపీ యువనేత వేగుళ్ల అజయ్‌బాబు పాల్గొన్నారు. సరస్వతి పూజ అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను అందజేశారు. కొండపల్లి వారివీధిలో శనివారంరాత్రి వేంకటేశ్వర స్వామివారి కల్యాణం నిర్వహించారు. కొండపల్లివారి వీధిలో గణపతి సంఘం ఆధ్వర్యంలో 21అడుగుల వినాయకుడిని ఏర్పా టుచేశారు. మండపాన్ని, గణనాథుడిని విద్యుత్ దీపా లతో అలంకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నా రు.ఆదివారం అధికసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

రూ.65,200 పలికిన వినాయకుడి లడ్డూ

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 15: ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనం వైభవంగా జరిగింది. గొల్లవిల్లి సిద్ధివినాయక ఆలయం వద్ద గణపతి లడ్డూను గ్రామానికి చెందిన యువకులు పోలిశెట్టి రామదాసు, పోలిశెట్టి దొరబాబు రూ.65,200కు దక్కించుకున్నారు. మద్దింశెట్టి పార్వతి జ్ఞాపకార్థం కుమారులు సీతారామస్వామి, చినవీర్రాజు, శివ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కూనవరం కర్షక గణపతి వేదిక వద్ద లక్ష్మీగణపతి హోమం, లక్షగరిక పూజ నిర్వహించారు. అన్న సమారాధన జరిగింది.

ఘనంగా గణపతి ఊరేగింపు

రావులపాలెం, సెప్టెంబరు15: గణపతి నవరాత్రులు తొమ్మిది రోజుల పూజల అనంతరం స్వామివారికి ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. రావులపాలెం మండలంలో తొమ్మిది రోజుల పూజలు అనంతరం కమిటీ సభ్యులు నిమజ్జన కార్యక్రమానికి ఏర్పాటు చేసుకున్నారు. రావులపాలెంలో గణపతిని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించి అనంతరం నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు.

వెంకన్న ఆలయంలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు




న్యాయమూర్తి జ్యోతిర్మయి దంపతులకు వస్త్రాలు అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, సెప్టెంబరు 15: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి హెచ్ఎస్‌జే వెంకట జ్యోతిర్మయి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వేదఆశీర్వచనం అందుకుని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్వామివారి చిత్రపటం, వస్త్రాలను ఉపకమిషనరు భూపతిరాజు కిశోర్‌కుమార్ అందించారు. వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఏలూరు రేంజ్ ఐజీ బి.అశోక్‌కుమార్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. సీఐ విద్యాసాగర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అర్చకబృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని వేద పండితుల ఆశీర్వచనం అందజేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉపకమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ స్వామివారి చిత్రపటంఅందజేశారు.

బ్యాక్‌డోర్ నియామకాలపై హైకోర్టు ఆగ్రహం!

యానాం, సెప్టెంబరు 15: పుదుచ్చేరిలోని వివిధ శాఖల్లో బ్యాక్‌డోర్ నియామకాలపై మద్రాసు హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పుదుచ్చేరి, కారైకాల్, మహే, యానాం రీజియన్లలో 52 శాఖల్లో రిజర్వేషన్ ప్రక్రియను పాటించకుండా నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు చేశారంటూ పలువురు కోర్టును ఆశ్రయించారు. రెండు వారాల్లో నియామక జాబితా అందజేయాలని హైకోర్టు ప్రధానన్యాయమూర్తి ఎస్.ఎం.సుబ్రమణి ఆదేశించారు.

టీడీపీ గ్రామ కార్యదర్శి రుద్రరాజు మృతి



ఉప్పలగుప్తం, సెప్టెంబరు 15: ఎస్.కొత్తపల్లి తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్ఎన్)(61) శనివారం రాత్రి మృతి చెందారు. సుదీర్ఘకాలంగా ఆయన పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ బొడ్డు బుజ్జి, పార్టీ అల్లవరం మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, కుచ్చెర్లపాటి పెద్దిరాజు, లంకే శ్రీను, మల్లాడి వెంకటరమణతో పాటు అధిక సంఖ్యలో కార్యకర్తలు, కూటమి నాయకులు నివాళులర్పించారు.

హుస్సేనీ ఎడ్యుకేషనల్ సేవలు అభినందనీయం

మామిడికుదురు, సెప్టెంబరు 15: విద్యాభివృద్ధికి హుస్సేనీ ఎడ్యుకేషనల్ అసోసియేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ కొనియాడారు. అసోసియేషన్ ద్వారా విద్యలో ప్రతిభ కనబరిచిన 20మంది ముస్లిం విద్యార్థులకు మెమోంటోలు, నగదు ప్రోత్సాహకాలను ఆదివారం మామిడికుదురులో జరిగిన సమావేశంలో అందించారు. మరో 70మందికి నోటు పుస్తకాలు, పెన్నులు, ప్యాడ్లు తదితర వస్తువులు అందించారు. సజ్జాద్‌హుస్సేన్, ఎండీ అలీబేగ్, అబేద్‌అలీ, ఆతాహుస్సేన్, నన్నేసా హుస్సేన్, కిశ్వర్, అబ్బాస్ ఖజరాని పాల్గొన్నారు.

చిత్రకళ విద్యార్థులకు ఎమ్మెల్యే వేగుళ్ల అభినందన

మండపేట, సెప్టెంబరు 15: మండపేటలోని సత్య డ్రాయింగ్ అకాడమి విద్యార్థులు చిత్రకళలో ప్రతిభ కనబరిచారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన పెయింటింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఆదివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును పార్టీ కార్యాలయంలో కలిశారు. విద్యార్థులను, శిక్షణ ఇస్తున్న డ్రాయింగ్ టీచర్ సత్యానందాన్ని వేగుళ్ల అభినందిచారు.

స్వచ్ఛభారత్

అంతర్వేది,సెప్టెంబరు15: స్వచ్ఛ భారత్ దినోత్సవం సందర్భంగా 17నుంచి అక్టోబరు 2వరకు మండలంలో స్వచ్ఛతా సేవా కార్యక్రమాలునిర్వహిస్తామని ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు.

కొత్తపేట పారిశుధ్య పనుల్లో సిబ్బంది, పాలకమండలి

- పారిశుధ్య సిబ్బంది విధులకు హాజరు కాకుండా నిరసన
- సిబ్బందితో కలిసి పాలక మండలి పారిశుధ్య పనులు



మెయిన్‌రోడ్డులో చెత్తను ఎత్తుతున్న పంచాయతీ పాలకవర్గ సభ్యులు

కొత్తపేట, సెప్టెంబరు 15: కొత్తపేటలో పారిశుధ్య కార్మికులు విధులకు హాజరుకాకపోవడంతో ఆ పనులు చేసేందుకు ఆదివారం సర్పంచ్ ఆధ్వర్యంలో పాలకవర్గం రోడ్డెక్కింది. కొత్తపేట మేజర్ పంచాయతీలో పాలకవర్గానికి, పారిశుధ్య సిబ్బందికి మధ్య జీతాల చెల్లింపు విషయంలో వివాదం ఏర్పడింది. పారిశుధ్య పనులు చేపట్టకుండా కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. దీనిపై పాలకవర్గం ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి జీతాలు చెల్లింపునకు బిల్లు పెట్టింది. అయినా విధులకు హాజరుకాకపోవడంపై ఆగ్రహించిన పారిశుధ్య కార్మికుల్లో కొందరిని తప్పించి మిగిలిన వారిని విధులకు రప్పించారు. దీనిపై పాలకవర్గం, పారిశుధ్య కార్మికుల మధ్య వివాదం నడిచింది. ఈనేపథ్యంలో కొంతమంది సిబ్బందితో కలిసి పాలకవర్గమే పారిశుధ్య పనులు చేసేందుకు నిర్ణయం తీసుకుని ఆదివారం సర్పంచ్ బూసి జయలక్ష్మీభాస్కరరావు ఆధ్వర్యంలో నడుంబిగించారు. గ్రామసంత మార్కెట్ ఏరియాలో, ప్రధా నరహదారిలో ఉన్న పేరుకుపోయిన చెత్తను తొలగించారు. కొందరు కార్మికులను తప్పించడంపై పారిశుధ్య కార్మికుల్లో ఆందోళన నెలకొంది. వారిని కూడా విధుల్లోకి తీసుకోవాలని యథావిధిగా పనులు చేస్తామని ముఖ్యనాయకుల వద్ద వారు వాపోయారు. ఉపసర్పంచ్ విళ్ల మారుతీప్రసాద్, కంఠంశెట్టి శ్రీనివాసరావు, కాశీ ధనరాజు, బయ్యే రాంబాబు, దేవపాటి వెంకటేశ్వరరావు, బండి రాజు, కడలి భీమేష్, లంక సుబ్రహ్మణ్యం, టీడీపీ నేతలు కముజు వెంకటేశ్వరరావు, యల్లమిల్లి జగన్మోహన్, వాసంశెట్టి సత్యనారాయణ, చోడపనీడి భాస్కరరావు, బూసి విష్ణు, బూసి వెంకటరమణ, ములపర్తి శ్రీను, ముద్రగడ ఫణి పారిశుధ్య పనుల్లో పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో ఉత్తమ నడవడిక



రాయవరం, సెప్టెంబరు 15: మనిషి ఎలా జీవించాలో భగవద్గీత నేర్పిస్తుందని, చిన్నతనం నుంచి విద్యార్థులతో తల్లిదండ్రులు భగవద్గీత పఠనం నేర్పిస్తే ఉత్తమ నడవడికి అలవాటు అవుతుందని ఆధ్యాత్మికవేత్తలు కొత్తూరి భవాని శంకరశర్మ, గోవిందవఝల దుర్గా నాగేంద్ర భాస్కరశర్మ పిలుపునిచ్చారు. ఆదివారం వెదురుపాక గీతా మందిరం వద్ద విద్యార్థులకు భగవద్గీత 18 అధ్యాయాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు మెమెంటో, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భవాని శంకరశర్మ, దుర్గా నాగేంద్ర భాస్కరశర్మ, అర్చకుడు జానార్ధనాచార్యులను సత్కరించారు. గీతా మందిరం నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి, పడాల శివ మణికంఠరెడ్డి, కొవ్వూరి సోమిరెడ్డి, వరలక్ష్మి దంపతులు సత్తి వెంకటరెడ్డి, కమలాదేవి దంపతులు , సత్సంగ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో కార్పొరేషన్లకు నిధులు నిల్: సుభాష్



మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

అల్లవరం, సెప్టెంబరు 15: శెట్టిబలిజ బీసీ కార్పొరేషన్లకు వైసీపీ హయాంలో నిధులు ఇవ్వలేదని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చెప్పారు. తూర్పులంకలో శెట్టిబలిజ సాధికారిక రాష్ట్ర డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు(కేవీ) అధ్యక్షతన ఆదివారం జరిగిన టీడీపీ కూటమి శెట్టిబలిజ ఆత్మీయ సదస్సులో ఆయన మాట్లాడారు. గత వైసీపీ పాలనలో సెటిల్‌మెంట్ దందాలపై ఆయన ధ్వజమెత్తారు. చంద్రబాబు కృష్ణా వరద బాధితులను ఆదుకున్న తీరు చారిత్రాత్మకమన్నారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో సీసీ రోడ్లు లేవని, కార్పొరేషన్ నిధులు ఇవ్వకుండా ప్రజలను మోసగించారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు మరో ఆరు నెలలో అమలు జరుగుతాయన్నారు. పార్టీ కోసం కష్టించి పనిచేసే వారిని గుర్తించాలని, కృష్ణా వరద బాధితులకు చంద్రబాబు అన్ని విధాల అండగా నిలిచారని టీడీపీ రాష్ట్ర నాయకుడు పెచ్చెట్టి చంద్రమౌళి, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షుడు పెచ్చెట్టి విజయలక్ష్మి అన్నారు. మంత్రి సుభాష్, ఎమ్మెల్యే ఆనందరావు, చంద్రమౌళి, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజును ఘనంగా సత్కరించారు. సదస్సులో గుబ్బల రామ్‌ప్రసాద్, గుబ్బల నాగేశ్వరరావు, దొంగ శ్రీను, మామిడిశెట్టి శ్రీరామ్, గెద్దాడ శ్రీనివాస్, కొప్పిశెట్టి రామకృష్ణ, కడలి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ మామిడిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుంగిన రోడ్డు.. మూసుకుపోయిన సాగునీటి తూర



కల్వర్ట్ వద్ద కుంగి ఏర్పడిన గొయ్యి

పి.గన్నవరం, సెప్టెంబరు 15: నరేంద్రపురం శివారు బూరుగుగుంట వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు కుంగిపోయి మధ్యలో గొయ్యి ఏర్పడింది. దీంతో భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కుందాలపల్లి డ్యామ్ నుంచి వచ్చిన పంటకాల్వ దిగువన ఉన్న వరి చేలకు సాగునీరు అందిస్తుంది. నరేంద్రపురం నుంచి వచ్చిన పంట కాల్వ బూరుగుగుంట వద్దకు వచ్చే సరికి ప్రధాన రోడ్డు మార్గంలో ఇవతలి వైపు పంట పొలాలకు రోడ్డు క్రింది నుంచి సిమెంట్ తూరలు ద్వారా సాగునీటిని పంపిస్తున్నారు. అయితే రోడ్డు అభివృద్ధి పనుల్లో సైతం ఈప్రదేశంలో కల్వర్టు ఏర్పాటు చేయలేదు. దీంతో భారీ వాహనాల రాకపోకలతో తూరలు ధ్వంసమై రోడ్డు క్రుంగిపోయింది. దీంతో తూరల్లో మట్టి కూరుకుపోవడంతో సాగునీరు ఇవతలి వైపునకు రావడం లేదు. పంటకాల్వ పరిధిలో ఉన్న 200 ఎకరాల వరి పొలాలకు సాగునీటి కష్టాలు ఏర్పడ్డాయి. గొయ్యి ఏర్పడిన చోట స్థానికులు ఎర్రజెండా, కొబ్బరి ఆకులతో ప్రమాద సూచిక ఏర్పాటు చేశారు. స్థానిక ఎంపీటీసీ పప్పుల సాయిబాబు తూరలో కూరుకుపోయిన మట్టిని ఎక్స్‌క వేటర్ సాయంతో తొలగించి సాగునీటికి ఇబ్బంది లేకుండా కొంతమేర పరిష్కారం చూపారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

కాట్రేనికోన, సెప్టెంబరు 15: చింతలమెరక పాఠశాల హెచ్ఎం వీపూరి భాగిరాజుకు చేయూత సంస్థ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించింది. కాకినాడలో జరిగిన కార్యక్రమంలో అవార్డు ప్రదానం జరిగింది. మండల ఎస్టీయూ అధ్యక్షుడు నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శి వర్మ, ఎంఈవో వెంకటరమణ శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థినులు సవాళ్లను దీటుగా ఎదుర్కోవాలి



విద్యార్థినులకు కిట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం రూరల్, సెప్టెంబరు 15: విద్యార్థినులు తమకు ఎదురయ్యే సమస్యలను, సవాళ్లను దీటుగా ఎదుర్కోవాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. విద్యార్థినులకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, సవాళ్లను ఎదుర్కొనేందుకు మానసిక స్థైర్యాన్ని పెంపొందించే విధంగా శ్రీవిధ సేవా సంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఇందుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు శ్రీవిధ సేవాసంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థినులు విద్యతో పాటు వ్యాయామం, క్రీడల పట్ల మక్కువ చూపాలని సంస్థ చైర్మన్ పొలమూరి ప్రసాదరావు పేర్కొన్నారు. ఉపాధ్యక్షురాలు, ప్రముఖ సైకాలజిస్టు పొలమూరి శ్రీమౌన విద్యార్థినుల కోసం అన్ని పాఠశాలల్లోను అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ప్రకటించారు. సంస్థ తరుపున బాలికలకు వివిధ రకాల గార్మెంట్లతో కూడిన కిట్లను ఎమ్మెల్యే అందజేశారు. గ్రామ సర్పంచ్ చొల్లంగి శివాలినీ-అప్పాజీ, బండారులంక సర్పంచ్ పెనుమాల సునీత, నాయకులు మల్లుల పోలయ్య, నాగిరెడ్డి తాతారావు, మోటూరి బాలాజీ, పిల్లా మంగతాయారు, గుమ్మడి ప్రసాద్, పొలమూరి ధరణి, వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, హెచ్ఎం వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

యానాం, సెప్టెంబరు 15: స్థానిక పిల్లారాయ వీధిలో ఉన్న శ్రీపిళ్లైయ్యార్ స్వామి (లక్ష్మీగణపతి) ఆలయంలో జరుగుతున్న నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు. తొలుత స్వామివారినిఅలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం యానాం వర్తకసంఘం ఉత్సవదారులుగా ఉన్న రథంపై ఉత్సవ విగ్రహాలను ఆశీనులు గావించి రథోత్సవం నిర్వహించారు. ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, వర్తక సంఘం ప్రతినిధులు మాజేటి సత్యభాస్కర్ వెంకటేశ్వర్, పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్
శ్రీలలిత	: భలే ఉన్నాడే
శేఖర్ స్క్రీన్-1	: కళింగ
శేఖర్ స్క్రీన్-2	: 35
రమా	: మత్తువదలరా-2
గణపతి	: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
వెంకటపద్మావతిస్క్రీన్-1	: సరిపోదా శనివారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	: ఏఆర్ఎం

ఆది గణపతి లడ్డూ వేలం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 15: అంగరలో ఆది గణపతి లడ్డూ వేలం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించారు. కొండపల్లి సూరిబాబు 18కిలోల లడ్డూను రూ.4వేలకు వేలం దక్కించుకున్నారు. అంగరలో పలు గణపతి ఆలయాల మండపాల వద్ద శనివారం రాత్రి విద్యార్థులు భక్తిశ్రద్ధలతో సరస్వతీ దేవిపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆది గణపతి ఆలయ చైర్మన్ పెద్దింశెట్టి సూరిబాబు, మేడేపల్లి కొండ, పడాల రామకృష్ణ, సంకాబత్తుల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం ప్రారంభం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 15: టేకిలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామివారి ముఖద్వారం ఆదివారం ప్రారంభమైంది. దాతల సహకారంతో నిర్మించిన ముఖద్వారానికి వేదపండితులు పూజలు నిర్వహించిన అనంతరం ప్రారంభించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, గ్రామస్తులు, అధిక సంఖ్యలోభక్తులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల తరలింపు

కె.గంగవరం, సెప్టెంబరు 15: విజయవాడ వరద బాధితులకు పంపిణీ చేసేందుకు కె.గంగవరం చిన్న మందా చర్చి వద్ద పాస్టర్ సలాది జకరయ్య ఆధ్వర్యంలో సమకూర్చిన నిత్యావసరాలు, దుప్పట్లు, చీరలు, ప్యాంట్స్, షర్టులు ప్రత్యేక వాహనంలో విజయవాడ తరలించారు. కార్యక్రమంలో పాస్టర్ అమ్మ ఎలిజిబెత్, పరిమళ గ్రేస్, చిన్నమంద యూత్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎండు గడ్డి, దాణా పంపిణీ

కె.గంగవరం, సెప్టెంబరు 15: పాతకోట గ్రామంలో రైతులు, గొర్రెల యజమానులకు ఆదివారం కపిలేశ్వరపురం మండలానికి చెందిన శ్రీప్రసన్న విఘ్నేశ్వర లైటింగ్ అండ్ సౌండ్ అసోసియేషన్, కె.గంగవరం మండలానికి చెందిన శ్రీలక్ష్మీ గణపతి టెంట్ హౌస్ లైటింగ్, సౌండ్స్ అసోసియేషన్ సహాయంతో ఎండుగడ్డి, గొర్రెల దాణా పంపిణీ చేశారు. కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, తండ్రి సత్యం, కూటమి నేతలు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపేట డీఎస్పీగా గోవిందరావు



కొత్తపేట, సెప్టెంబరు 15: కొత్తపేట డీఎస్పీగా వై.గోవిందరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు అమలాపురం మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా ఉన్న గోవిందరావును కొత్తపేట డీఎస్పీగా నియమించారు. ఈమేరకు సోమవారం విధుల్లో చేరనున్నారు. ఇక్కడ పనిచేసిన కేవీ రమణ ఏఎస్పీగా పదోన్నతిపై బదిలీపై వెళ్లారు.

పవర్ లిఫ్టింగ్‌లో గురుకుల బాలికల ప్రతిభ

రాజోలు, సెప్టెంబరు 15: అమలాపురం దుడ్డువారి అగ్రహంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్స్ క్లబ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్-2024 పోటీల్లో శివకోటి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన ఇంటర్మీడియట్ చదువుతున్న ఆరుగురు బాలికలు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ కేటగిరీలో కె.మంజుల ప్రథమ, ఎన్.జెస్సిక ద్వితీయస్థానం సాధించారని ప్రిన్సిపాల్ టి.లలితకుమారి ఆదివారం తెలిపారు. బాలికలకు శిక్షణ ఇచ్చిన పీఈటీ పి.రత్నకుమారి మాస్టర్స్ కేటగిరిలో బంగారు పతకం సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. పీఈటీ రత్నకుమారి, బాలికలు మంజుల, జెస్సికలను ఆదివారం ప్రిన్సిపాల్ లలితకుమారి, వైస్ ప్రిన్సిపాల్ వి.అనితకుమారి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

బి.దొడ్డవరంలో గడ్డి ట్రాక్టరు దగ్ధం

మామిడికుదురు, సెప్టెంబరు 15: ట్రాక్టరు విద్యుత్ ప్రమాదానికి గురవ్వడంతో దగ్ధమైంది. ద్రాక్షారామ నుంచి గడ్డి కొనుగోలుచేసి పెదపట్నంలంక తీసుకువెళుతుండగా బి.దొడ్డవరంలో విద్యుత్ వైర్లు తగిలి గడ్డి ట్రాక్టరు దగ్ధమైంది. ట్రాక్టర్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు ఈప్రమాదం నుంచి బయటపడినట్టు ట్రాక్టరు యజమాని ప్రసాద్ తెలిపారు.

ఆర్థిక సహాయం

రాజోలు, సెప్టెంబరు 15: శివకోటి పద్దెనిమిది ఎకరాల కాలనీకి చెందిన మోకా రవిబాబు ఇటీవల ప్రమాదానికి గురయ్యాడు. ఆపరేషన్ చేయించుకుని ఇంటికే పరిమితమయ్యాడు. ఉపాధ్యాయులు సమకూర్చిన రూ.30వేలు, బియ్యం, నిత్యావసరాలను ఉపాధ్యాయులు ఉండవల్లి శ్రీనివాస్ అందజేశారు.

200 రకాల ప్రసాదాలతో వినాయకుడికి నివేదన



మామిడికుదురు, సెప్టెంబరు 15: మామిడికుదురు ఆదుర్రు శివారుమోరిపొలంలో వినాయకుడికి శనివారం రాత్రి భక్తులు 200 రకాల ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు. ఆలయం వద్ద అఖండ జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. ఈజ్యోతిర్లింగార్చన భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

ఆత్రేయపురం, సెప్టెంబరు 15: నార్కెడిమిల్లిలో గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లోకి ప్రవేశించి బంగారు, వెండి వస్తువులు అపహరించుకుపోయారు. నార్కెడిమిల్లికి చెందిన పోతురెడ్డి సత్యనారాయణ పచ్చళ్ళ వ్యాపారం చేస్తుంటాడు. 15రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి వ్యాపారం నిమిత్తం కడప వెళ్లాడు. ఇంటి తలుపులు తీసి ఉన్నాయని ఈనెల14న ఇంటి ఎదురుగా ఉన్న లక్ష్మీనర్సమ్మ సమాచారం అందించారు. ఈనేపథ్యంలో కడప నుంచి సత్యనారాయణ స్వగ్రామం చేరుకున్నాడు. ఇంటిలోని బీరువా పెకిలించి 20గ్రాముల బంగారం, 15తులాల వెండి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.


పాటు రేవులో పడి వ్యక్తి మృతి

మామిడికుదురు, సెప్టెంబరు 15: అప్పనపల్లి పాటు రేవులో పడి వ్యక్తి మృతి చెందాడు. అప్పనపల్లి సాకావారిపేటకు చెందిన వడ్డి నాగరాజు శనివారం ఉదయం కాలకృత్యాలకు అప్పనపల్లి పాటురేవుకు వెళ్లాడు. అతడు ఇంటికి తిరిగి రాకపోవడంతో అతడి సోదరుడు వడ్డి అభిమన్యుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై నగరం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం 2.30గంటల సమయంలో పాటు రేవులో నాగరాజు శవం తేలింది. మృతదేహాన్ని రాజోలు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పంట బోదెలో పడి వ్యక్తి మృతి

అంబాజీపేట, సెప్టెంబరు15: టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్న ఓ వ్యక్తికి ఫిట్స్ రావడంతో పక్కనఉన్న పంటబోదెలోపడి మృతిచెందాడు. పసుపల్లికి చెందిన బొక్కా వెంకటేశ్వరరావు(48) టీవీఎస్ ఎక్సెల్‌పై ఇంటి నుంచి ముక్కామల వస్తున్నాడు. ముక్కామల వచ్చే సరికి ఫిట్స్ రావడంతో వెంకటేశ్వరరావు పంట బోదెలో పడిపోవడంతో మృతిచెందాడు. అతడి సోదరుడు సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు.

టీడీపీ నేత నేత్ర దానం



ఆత్రేయపురం, సెప్టెంబరు 15: పేరవరానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు నాదెండ్ల సూర్యప్రకాష్(93) ఆదివారం మృతిచెందాడు. ఈయనకు భార్య ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈయన జీవించి ఉండగానే నేత్రాలను దానం చేశారు. అనపర్తి నారాయణరెడ్డి నేత్రాలయ వైద్యబృందం కుటుంబ సభ్యుల సమాచారం మేరకు నేత్రాలను సేకరించారు. ఆయన మృతిపై ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు ముళ్లపూడి భాస్కరరావు, కరుటూరి నరసింహారావు సంతాపం వ్యక్తం చేశారు.

పశుశిక్షణా కేంద్రం టెక్నో పార్కులో చోరీ

మండపేట, సెప్టెంబరు 15: మండపేటలో ఉన్న పశుశిక్షణా కేంద్రంలో చోరీ జరిగింది. ఈవిషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాడి రైతుల ఔత్సాహిక యువతకు స్వయం ఉపాధికోసం పాలఉత్పత్తులు, విక్రయాలు కోసం శిక్షణ ఇచ్చేందుకు మండపేటలో పశుశిక్షణా కేంద్రాన్ని ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఒక ఏడాది పాటు పని చేసింది. నాలుగేళ్ల నుంచి మూతపడింది. ఈకేంద్రంలో ఈనెల7న చోరీ జరిగింది. శిక్షణా కేంద్రంలోని టెక్నోపార్కులో పరికరాలు, విద్యుత్ మోటారు, విలువైన సామగ్రిని దొంగలు అపహరించారు. పశుసంవర్ధకశాఖ అధికారిణి డాక్టర్ నాగమణి మండపేట పట్టణ పోలీసులకు ఈనెల7న ఫిర్యాదు చేశారు.

ప్రధాన రహదారుల చెంతన చెత్త తొలగింపు

పి.గన్నవరం, సెప్టెంబరు 15: కలెక్టరు ఆదేశాలతో గ్రామపంచాయతీల్లో ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్లలో చెత్తను తొలగిస్తున్నారు. పి.గన్నవరం, గంటిపెదపూడి, ఉడిమూడి, బెల్లంపూడి, ముంగండ తదితర గ్రామా ల్లో ఆదివారం ప్రధాన రహదారులు చెంతనే ఉన్న చెత్తను పంచాయతీ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన తొలగింప చేస్తున్నారని ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరావు తెలిపారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ కార్యదర్శులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నామన్నారు. చెత్తతో సంపద తయారీ కేంద్రాల లక్ష్యం నెరవేరకపోవడంతో పాటు గ్రామాల్లో డంపింగ్ యార్డుల కొరతతో ఈపరిస్థితి నెలకొంది.

ఆలయంలో పూజలు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 15: రావులచెరువు లక్ష్మీగణపతి ఆలయంలో కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు పితాని దుర్గాజ్ఞానేశ్వరరావు ఆధ్వర్యంలో మంత్రి సుభాష్‌ను సత్కరించారు. గొవ్వాల నాగరాజు, సలాది వెంకటసాయిరామ్, గొవ్వాల అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

ప్రపంచ 'లా' డే శుభాకాంక్షలు
న్యాయమూర్తులకు, న్యాయవాద మిత్రులకు మరియు ప్రజలకు న్యాయ దినోత్సవ శుభాకాంక్షజలు...
పెయ్యల సత్యనారాయణ, B.Com.,B.L., అడ్వకేట్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, అమలాపురం, సెల్: 99514 50225
బి. సంతోషం, అడ్వకేట్ | ఎం. మోహన్‌రావు, అడ్వకేట్



ప్రపంచ 'లా' డే శుభాకాంక్షలు
" సర్వేజన సుఖినోభవంతు"
న్యాయమూర్తులకు, న్యాయవాద మిత్రులకు మరియు ప్రజలకు న్యాయ దినోత్సవ శుభాకాంక్షజలు...
వెంపరాల భాస్కర శాస్త్రి (V.K.S.B.S) అడ్వకేట్, B.Com.,L.L.M., మాజీ లోక అదాలత్ మెంబర్ బిజెపి లీగల్ సెల్ అమలాపురం, సెల్: 81215 50987



వరల్డ్ 'లా' డే శుభాకాంక్షలు
మిత్రులకు, శ్రేయోభిలాషులకు, అడ్వకేట్ సోదరులకు వరల్డ్ "లా" డే శుభాకాంక్షలు...
నక్కా రాజశేఖర్ B.A.,B.L., అడ్వకేట్, అమలాపురం సెల్: 98491 93665

